నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, ఆదివారం 22 డిసెంబర్ 2024 | JANAGAON

వరంగల్ కమిషరేట్‌లోని తూర్పు నియోజకవర్గంలో పోలీసు అధికారులు హద్దు మీరుతూ.. అతి చేస్తున్నారు. వీరి తీరు తరచూ విమర్శలకు దారి తీస్తున్నది. పేదలు, సామాన్యులు, వ్యాపా రులు, ఉద్యోగులు, ప్రతిపక్ష పార్టీ నాయకులు, చివరికి అధికార పార్టీలోని వారినీ వేధిస్తున్నారు. తాజాగా ఓ రౌడీషీటర్‌తో అంటకాగుతున్న ఏసీపీ ఈసారి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడితో దురుసుగా ప్రవర్తించాడు. కేసు పెడతా, కొడతా అని బెదిరిస్తూ ఓవరాక్షన్ చేశాడు. ఖాకీల తీరుతో ఇబ్బంది పడుతున్నామని, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

- వరంగల్, డిసెంబర్21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- కొనసాగుతున్న వేధింపుల పరంపర
- ఈసారి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడితో దురుసుగా వ్యవహరించిన ఏసీపీ
- కేసు పెడతా, కొడతా అని బెదిరింపులు
- రౌడీషీటర్‌తో అంటకాగుతున్న సదరు ఖాకీ
- పట్టించుకోని ఉన్నతాధికారులు

హద్దు మీరుతూ.. అతి చేస్తూ

సామాన్యులపై తూర్పు పోలీసుల ఓవరాక్షన్

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలీసు అధికారులు అతి ఉత్సాహం చూపుతున్నారు. సామాన్యులపై అమర్యాదగా వ్యవహరిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటీవల యాత్ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో మంత్రి కొండా సురేఖ ప్రత్యర్థి వర్గం వారు గెలిచారనే కారణంతో మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జూపల్లి వెంకటరత్నం అధికార పార్టీ కార్యకర్తలను వేధించాడు. ఇప్పటికే పలుసార్లు వివాదాస్పదంగా మారిన వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ మరోసారి ఇదేరకంగా వ్యవహరించారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని వాణిజ్య వ్యవహారాలకు ప్రాతినిధ్యం వహించే వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి విషయంలో ఏసీపీ నందిరాంనాయక్ అతిగా వ్యవహరించడంతో పోలీసు అధికారులపై విమర్శలు పెరుగుతున్నాయి. చాంబర్ ఆఫ్ కామర్స్‌తో అనుబంధం ఉన్న ఓ వ్యాపారి విషయంలో మధ్యవర్తిత్వం వహించినందుకు పోలీసులు బొమ్మినేని రవీందర్‌రెడ్డిపైనే కేసు నమోదు చేశారు. ఆ తర్వాత వరంగ ల్ ఏసీపీ నందిరాంనాయక్ తన ఆఫీసుకు పిలిపించి ఇక్కడ కూర్చోవద్దని, ఒకింత దురుసుగా వ్యవహరించారు. వ్యాపారుల ప్రతినిధితో ఏసీపీ ఇలా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. ఏడాదిగా రౌడీ షీటర్ ఆదేశాల ప్రకారం పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీ వ్యాపారుల ప్రతినిధితో ఇలా వ్యవహరించడం సరికాదని వరంగల్ తూర్పు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏసీపీ తీరు మొదటి నుంచీ ఇలాగే ఉంటున్నది, ఈయన పరిధిలోని పోలీస్ స్టేషన్లలో బాధితుల కంటే మాజీ రౌడీ షీటర్ చెప్పిన వారికే పోలీసులు వత్తా సు పలుకుతున్నారని చెప్పుకుంటున్నారు.

ఇదీ విషయం..

వరంగల్‌లోని ఓ వ్యాపారికి చెందిన భవనం జేపీఎన్ రోడ్డులో ఉన్నది. ఇటీవల దీన్ని విక్ర యించారు. భవనం రిజిస్ట్రేషన్ కోసం అందులో ఉంటున్న వ్యాపారులు ఖాళీ చేయించాల్సి ఉన్న ది. ఓ వ్యక్తి ఖాళీ చేయకుండా యజమానికి లీగల్ నోటీసు ఇచ్చినట్లు తెలిసింది. యజమానితో కలిసి బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఆ వ్యాపారితో కలిసి భవనం వద్దకు వెళ్లి మాట్లాడ రని, ఆ ప్రక్రియ లో చిన్నపాటి వాదులాట జరగిందని సమాచారం. అనంతరం కిరాయిదారుడు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అంతా తానై వ్యవహరిస్తున్న మాజీ రౌడీ షీటర్‌ను సంప్రదించాడు. అతడి ఆదేశాల మేరకు కిరాయిదారుడు భవనం యజమాని, బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వీరితో వెళ్లిన మరో వ్యాపారిపైనా ఇంతె జార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. వెంటనే కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ ముగ్గురు వ్యాపారులు వెళ్లి ఏసీపీని కలవాలని ఆదేశించారు. అక్కడి నుంచి ముగ్గురు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ చాంబర్‌లోకి వెళ్లిన తర్వాత కూర్చునే క్రమంలో రవీంద్ రెడ్డితో ఏసీపీ దురుసుగా, అమర్యాదగా మాట్లాడారు. కేసు పెడతా, కొడతా అని బెదిరించడంతో ఆయన మనస్తాపంతో వెంటనే అక్కడి నుంచి మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి దగ్గరకు వెళ్లాడు. వరంగల్ తూర్పులోని పోలీసుల తీరు, ముఖ్యంగా వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ దురుసు ప్రవర్తనపై వివరించారు. పోలీసుల తర పున తాను క్షమాపణ కోరుతు న్నానని కొండా మురళి రవీందర్‌రెడ్డితో చెప్పినట్లు తెలిసింది. తూర్పు నియోజకవర్గంలోని ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు పదేపదే వివాదాస్పదంగా వ్యవహరిస్తున్నా ఉన్నతాధికారులు వారిపై చర్యల విషయంలో స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. పోలీసుల తీరుతో సామాన్యులు, వ్యాపారులు అందరూ ఇబ్బంది పడుతున్నారని, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

అవమానం జరిగిన వారినే అడగండి: ఏసీపీ నందిరాంనాయక్

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి విషయంలో ఏసీపీ నందిరాంనాయక్‌ను వివరాలు అడిగేందుకు ప్రయత్నించగా... 'అవమానం జరిగిందని చెప్పిన వారినే అడగండి. ఇక్కడ ఏం జరిగిందో వాళ్లే చెబుతారు. దీనిపై నేను ఏమీ చెప్పలేను' అని అన్నారు.

వరంగల్ ఏసీపీపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

కాశీబుగ్గ: అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి వర్గానికి కొమ్ము కాస్తున్న ఏసీపీ నందిరాంనాయక్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులను మట్టెవాడ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అవమానించిన ఏసీపీ నందిరాం నాయక్ తీరును ఖండిస్తున్నట్లు తెలిపారు. మంత్రి సురేఖ భర్త కొండా మురళీధర్ ఎవరిపై కేసులు పెట్టాలని చెప్తే వారిపై ఏసీపీ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. వేలాది మంది వ్యాపారులకు పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్న రవీందర్‌రెడ్డిని అవమానించడం మంచి పద్ధతి కాదని అన్నారు. మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో అమాయక ప్రజలను పోలీసులు వేధిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇకనైనా ఏసీపీతో పాటు పోలీస్ సిబ్బంది తమ వైఖరిని మార్చుకోవాలని బీజేపీ తరపున డిమాండ్ చేశారు.

రైతులందరికీ ఇవ్వాలి

పంట పెట్టుబడి కోసం గతంలో ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని ప్రతి సీజన్‌లో తప్పనిసరిగా ఇవ్వాలి. ఈ పథకం వల్ల పంటలు పండించుకునే రైతులకు మంచి ఉపశమనం కలిగించేలా ఉండేవి. ఇప్పుడు రెండు సీజన్ల నుంచి పెట్టుబడి డబ్బులు లేకపోవడంతో మేమంతా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా రైతుబంధు ఇవ్వాలి.

– పొలాటి గోపాల్‌రావు, రైతు, ఎల్కతుర్తి మండలం, సూరారం

అన్ని పంటలకు ఇవ్వాలి

రైతులు పండించే అన్ని పంటలకు రైతు బంధు ఇవ్వాలి. దీర్ఘ కాల పంటలకు కూడా రెండు సార్లు రైతుబంధు ఇస్తేనే మాకు కొంత ప్రోత్సాహం ఇచ్చినట్లవుతుంది. మూడు పంటలు కూడా పండిం చే రైతులుంటే వారికి కూడా మూడు సార్లు రైతు భరోసా ఇచ్చినట్లయితే వ్యవసాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలుంటాయి.

– మిల్కూరి తిరుపతిరెడ్డి, రైతు, ఎల్కతుర్తి

పెట్టుబడి సాయం కోసం కొండంత ఆశతో ఎదురుచూస్తున్న రైతన్నల్లో అయోమయం.. గందరగోళం కొనసాగుతూనే ఉంది. రైతుబంధు పథకం పేరు మార్చి ప్రతి సీజన్‌కు రూ.7500 ఇస్తామంటూ 'కోతలు' కోసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి పడాదైనా రైతుకు భరోసా ఇవ్వకపోవడంపై అందరిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. తాజాగా శనివారం అసెంబ్లీ జరిగిన చర్చలోనూ పెట్టుబడి సాయం ఎప్పుడు, ఎవరికిస్తారనే విషయమై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వకుండా దాటవేయడంపై నిరాశకు గురయ్యారు. ఇప్పటికైనా నాణ్చివేత ధోరణి వీడి కొర్రీలు పెట్టకుండా అన్ని పంటలకు, అందరు రైతులకు రైతుబంధు ఇవ్వాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

- హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 21

- ఎవరికిస్తారో.. ఎప్పుడిస్తారో చెప్పని సీఎం
- పెట్టుబడి సాయంపై దాటవేత ధోరణి
- అసెంబ్లీ చర్చలో స్పష్టత కరువు
- రేవంత్ తీరుపై అన్నదాతల ఆగ్రహం
- కొర్రీలు పెట్టకుండా అందరికీ ఇవ్వాలని డిమాండ్

★ నో క్లారిటీ

రైతుకు భరోసా ఏమైంది..?

రైతుభరోసా పథకం అమలు విషయంలో ఇంకా స్పష్టతే రావడం లేదు. అసెంబ్లీలో శనివారం జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో గుట్టలకు, రాళ్లకు కూడా రైతుబంధు పేరుతో కోట్ల రూపాయలు దుర్వినియోగం జరిగాయని ఆరోపణల పర్వానికి తెరలేపారే తప్ప ఎప్పుడిస్తారో, ఎవరికి ఇస్తారనేది మాత్రం చెప్పకుండా దాటవేయడం రైతులకు విస్మయం కలిగించింది. గతంలో బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన రైతు బంధు స్థానంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పేరుతో ఎకరానికి ప్రతి పంట కాలానికి రూ.7500కు పెంచుతామని గద్దె నెక్కి.. ఏడాది దాటినా ఇప్పటివరకు అమలు చేయలేదు. అప్పుడిస్తాం, ఇప్పుడిస్తాం అని దాటవేస్తున్నరే తప్పితే అమలు మాత్రం చేయడం లేదు. తాజాగా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో శనివారం రైతుభరోసాపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. దీనికి సమాధానం ఇచ్చిన ముఖ్యమంత్రి గతంలో కొందరు అధికారులు చేసిన పొరపాట్లను మాత్రమే ప్రస్తావించారు తప్ప ఇప్పుడు ఇస్తామని మాత్రం చెప్పకపోవడం పట్ల రైతులు నిరాశకు గురయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన నిధుల ద్వారా లక్షా 45వేల 44మందికి 132కోట్ల 137 రూపాయలు 2023 డిసెంబర్‌లో రైతులకు ఇచ్చారు. ఇక ఆ తర్వాత రైతులకు ప్రభుత్వం నుంచి రూపాయి కూడా ఇవ్వలేదు. అయితే ఇప్పుడు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కూడా స్పష్టత లేకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- కురవి నుంచి కలెక్టరేట్ వరకు రైతు సహదేవ్ పాదయాత్ర
- సంఘీభావం తెలిపి వెంట నడిచిన రైతులు

కురవి, డిసెంబర్ 21: రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన రైతు బేతమళ్ల సహదేవ్ నాగలి భుజాన వేసుకుని కలెక్టరేట్‌కు పాదయాత్రగా బయలుదేరాడు. మండల కేంద్రంలో సహదేవ్ చేపట్టిన రైతు నిరసన దీక్ష శనివారానికి 7వ రోజుకు చేరగా, రైతులు భూక్యా మంగీలాల్‌నాయక్, మిర్యాల శ్రీనివాస్, నూతక్కి సాంబశివరావు సంఘీభా వం తెలిపి ఆయన వెంట వెళ్లారు. అనంతరం కలెక్టరేట్‌లోకి వెళ్లి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ సందర్భంగా సహదేవ్ మాట్లాడుతూ సర్కారు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని వెంటనే చేయాలన్నారు. రేషన్, ఆధార్ కార్డు అని.. అనేక ఆంక్షలు విధిస్తూ రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. విడతల పేరుతో మోసం చేస్తున్న ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెప్తారని, ఎద్దు ఏడ్చిన వ్యవసాయం.. రైతు ఏడ్చిన రాజ్యం ఎన్నటికీ నిలువదని అన్నారు. కనీసం రూ. లక్షలోపు ఉన్న రైతులకు మాఫీ కాలేదంటే ఇంకెవరికి చేశారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం స్పందించి జనవరి 26 వరకు రూ. 2 లక్షల లోపు ఉన్న రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలన్నారు. లేకుంటే ఫిబ్రవరి మొదటి వారం నుంచి కలెక్టరే ట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఈ పాదయాత్రకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు కుర్ర మహేశ్, బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవినాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్, జిల్లా అధ్యక్షుడు అంగోత్ చందూలాల్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సామ్యేల్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు సురేశ్ నాయక్, గిరిజన వికలాంగుల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రాందాస్‌నాయక్, ఎన్‌పీఆర్‌డీ మాజీ రాష్ట్ర నాయకుడు సయ్యద్‌ఖాజా, రైతులు, జర్నలిస్టులు మద్దతు తెలిపారు.

కురవిలో పాదయాత్ర మొదలెడుతున్న దళిత రైతు బేతమళ్ల సహదేవ్, సంఘీభావం తెలుపుతున్న రైతులు



కుట్టు మిషన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి, మాజీ ఎమ్మెల్యే చల్లా

- ఏడాదిలో ఒక్క పథకాన్నీ అమలు చేయని ప్రభుత్వం
- కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- పదవిలో లేకున్నా ప్రజలతోనే ఉంటా
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ

కేసులకు భయపడం.. హామీలపై ప్రశ్నిస్తాం

పరకాల, డిసెంబర్ 21: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా పెడుతున్న కేసులకు భయపడేది లేదని, హామీల అమలు కోసం ప్రశ్నిస్తూనే ఉంటామని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 650 మంది మహిళలకు పరకాల పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. పరకాల నియోజకవర్గానికి కేసీఆర్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును మంజూరు చేయగా.. అప్పటి మంత్రి కేటీఆర్ కృషితో అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టాయన్నారు. వాటిలో ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు వేల మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామన్నారు. అందులో మొదటి విడతగా 650 మందికి కుట్టు మిషన్లు అందించామని, రానున్న రోజుల్లో మిగిలిన వారికీ అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదని విమర్శించారు. హామీల అమలు కోసం కేటీఆర్‌తో సహా ప్రతి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజల పక్షాన పోరాడుతామని పోచంపల్లి అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ పదవిలో ఉన్నా.. లేకున్నా ప్రజల కోసమే పని చేస్తామన్నారు. గడిచిన ఏడాది కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులకే శంకుస్థాపనలు చేస్తూన్నారని, అప్పుడు పూర్తయిన పనులను ప్రారంభిస్తున్నారన్నారు. పాలనను పక్కన పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఏడాదిలోనే రాష్ట్రం ఐదేండ్లు వెనక్కి వెళ్లిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేతాని శ్రీనివాస్‌రెడ్డి, బండి సారంగపాణి, నల్లెల్ల లింగమూర్తి, రేగూరి విజయపాల్‌రెడ్డి, జాకీర్ అలీ, కుమారస్వామి, దామెర మొగిలి, గండె వెంకటేశ్వర్లు, ముదాలపల్లి అశోక్, మధుసూదన్‌రెడ్డి, పరకాల, నడికూడ, దామెర మండలాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

హైడ్రాతో రియల్ ఎస్టేట్ కుదేలు

శాసనమండలిలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైడ్రాతో రాష్ట్ర రాజధానితో పాటు తెలంగాణ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయిందని, నిర్మాణరంగం కుదేలైందని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శనివారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచి భరోసా ఇవ్వాలని, అలా కాకుండా భయభ్రాంతులకు గురిచేయడం వల్ల రియల్ ఎస్టేట్, నిర్మాణరంగం కుదేలైందని ఫలితంగా అన్ని జిల్లాల్లో ఏ జిల్లాలో కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయిందన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లతో పోలిస్తే సగం కూడా జరగడం లేదని ఇందుకు హై డ్రానే ప్రధాన కారణమని తెలిపారు. మున్సిపాలిటీలో కలిసిన విలీన గ్రామాల ప్రజల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. విలీన గ్రామాలు కలువడం వల్ల ఇంటి పన్నులు, కొత్తగా ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతులు తీ సుకోవాలంటే ప్రజలు ఫీజులు తప్పక చెల్లించాల్సి వస్తున్నదని, సౌకర్యాలు వి ష యానికి వచ్చేసరికి అరకొరగా ఉండడం వల్ల ఆయా ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గాంధీ పార్క్‌ను ఖాళీ చేయించాలి

మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో గత ప్రభుత్వం వెజ్, నాన్‌వెజ్, ఫ్రూట్స్, మార్కెట్లు నిర్మించి ప్రారంభించిందని, అయితే తాత్కాలికంగా గాంధీ పార్కులో చిరు వ్యాపారులు ఉన్నారని వారిని వెంటనే ఖాళీ చేయించి కొత్తగా నిర్మించిన మార్కెట్లోకి పంపాలని ఆయన కోరారు. గతంలో ఇదే విషయమై కలెక్టర్‌కు విన్నవించినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారిని కొత్త మార్కెట్లోకి పంపాలని విజ్ఞప్తి చేశారు.

మౌంటెనీర్ యశ్వంత్‌కు రాష్ట్రపతి అభినందన



రాష్ట్రపతికి జ్ఞాపిక అందిస్తున్న యశ్వంత్

చిన్నగూడూరు(మరిపెడ), డిసెంబర్ 21: మరిపెడ మండలం వీరారం రెవెన్యూ పరిధిలోని భూక్యా తండాకు చెందిన భూక్యా యశ్వంత్‌ను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అభినందించారు. యశ్వంత్ గతంలో సౌత్ ఆఫ్రికాలోని కిలిమంజారో, యూరప్‌లోని ఎల్బ్రూస్ తదితర పర్వతాలతో పాటు ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లోని మౌంట్ గోరిచెన్ పర్వతాన్ని అధిరోహించి గుర్తింపు పొందాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని బొల్లారం వచ్చిన రాష్ట్రపతిను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి జ్ఞాపిక అందించాడు. ఈ సందర్భంగా రాష్ట్రపతి యశ్వంత్‌ను అభినందించి భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లేవి?



- బల్లార్షా సెక్షన్‌లో ఇంకా ప్రకటించని రైల్వే శాఖ
- ఎదురుచూస్తున్న అయ్యప్ప స్వాములు
- రాష్ట్రంలో ఇంకా కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వ వివక్ష

కాజీపేట, డిసెంబర్ 21 : దక్షిణ మధ్య రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం సికింద్రాబాద్‌లోనే ఉన్నా రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉంది. కాజీపేట-బల్లార్షా సెక్షన్ నుంచి శబరిమలకు ప్రత్యేక రైళ్లను ఇప్పటి వరకు రైల్వే శాఖ ప్రకటించలేదు. కేరళ రాష్ట్రంలోని శబరిమలలో ఏటా జరిగే అయ్యప్ప మండల పూజలు, జ్యోతి దర్శనానికి డిసెంబర్, జనవరి నెలల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది స్వాములు, భక్తులు వెళ్తుంటారు. కాజీపేట-బలార్షా సెక్షన్ పరిధిలోని సిర్పూర్ కాగజ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్ నుంచి శబరిమలకు ఒక్క ప్రత్యేక రైలును కూడా రైల్వేశాఖ నడపడం లేదు. కేవలం నిజామాబాద్ నుంచి కొట్టాయం వరకు ఒక రైలును ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. అయితే సికింద్రాబాద్ పరిధిలోని సికింద్రాబాద్, మౌలాలి, కాచిగూడ రైల్వే స్టేషన్ల నుంచి ఇప్పటికే ప్రత్యేక రైళ్లను ప్రకటించిన రైల్వే శాఖ ఇతర ముఖ్య ప్రాంతాలను మాత్రం విస్మరించింది. మౌలాలి నుంచి వయా పంగిడిపల్లి, మిర్యాలగూడ, గుంటూరు రైల్వే స్టేషన్ల మీదుగా కొట్టాయంకు వెళ్లేలా ప్రత్యేక రైలు రూట్‌ను రైల్వేశాఖ ఖరారు చేసింది. అదే ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, మచిలీపట్నం, నర్సాపూర్, గుంటూరు తదితర ముఖ్య రైల్వే స్టేషన్ల నుంచి ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ షెడ్యూల్ విడుదల చేయగా, స్వాములు టికెట్ల రిజర్వేషన్ కూడా పూర్తిచేసుకున్నారు. ఇక ఉత్తర తెలంగాణలోని ప్రధాన జిల్లాల మీదుగా శబరిమల వెళ్లేందుకు ఇప్పటివరకు ఒక్క ప్రత్యేక రైలును కూడా ప్రకటించలేదని అయ్యప్పస్వాములు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ సమయానికే సిర్పూర్ కాగజ్‌నగర్, కరీంగనగర్, నిజామాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లను ప్రకటించి షెడ్యూల్ విడుదల చేసేదని వారు పేర్కొంటున్నారు. ఈసారి పరిస్థితులు అనుకూలించడంతో ఈ ప్రాంతంలోని లక్షలాది మంది భక్తులు స్వామి దీక్షలు తీసుకున్నారు. ఇప్పటికే కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా కేరళలోని తిరువనంతపురం (శబరిమల) వెళ్లే అన్ని రైళ్లలో టికెట్ల రిజర్వేషన్ ప్రక్రియ ముగిసింది. అయ్యప్ప దర్శనానికి వెళ్లేందుకు రైల్వే అధికారులు ఎప్పుడు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తారోనని స్వాములు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే శాఖ స్పందించి కాజీపేట-బల్లార్షా సెక్షన్‌లో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

విద్యుత్ ఉచ్చుకు యువకుడి బలి

గణేశ్(ఫైల్)

చిట్యాల, డిసెంబర్ 21 : అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చుకు యువకుడు తగిలి మృతి చెందిన ఘటన మండలంలోని వెంచరామి శివారులో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. టేకుమట్ల మండలం భూర్నపల్లికి చెందిన లోకిని గణేశ్(24) వెంచరామి శివారులో మృతి చెంది ఉన్నట్లు స్థానికులు మృతుడి భార్య, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ మల్లేశ్‌యాదవ్, ఎస్సై శ్రావణ్ కుమార్ మృతి చెందిన తీరును పరిశీలించారు. ఈ నెల 20న సాయంత్రం గణేశ్ ఇంటి నుంచి వెళ్లినట్లు, అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి అదేరోజు అర్ధరాత్రి మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడే విద్యుత్ తీగ ఉచ్చులను ఏర్పాటు చేశాడా.. ఇతరులు అమర్చారా.. అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

- సర్వశిక్షా ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన..

ములుగు రూరల్, డిసెంబర్ 21: రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు 12 రోజులుగా దీక్ష కొనసాగిస్తున్నారు. శనివారం ములుగు కలెక్టరేట్ సమీపంలో ఇలా అర్ధనగ్న ప్రదర్శన ద్వారా నిరసన తెలిపారు. వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.